# అవగాహన లోపమే అసలు సమస్య

చెన్నై, న్యూస్‌టుడే: దేశంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని మియాట్ ఆసుపత్రిలోని 'ఇండో బ్రిటిష్ హెల్త్ ఇనిషియేటివ్ (ఐబీహెచ్ఐ) పేర్కొంది. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఐబీహెచ్ఐ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పృథ్వీ మోహన్‌దాస్ మాట్లాడారు. ప్రస్తుతం అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి, అవగాహనలేమితో రోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్యాన్సర్ వంటి వ్యాధులకు చికిత్సల్ని బలోపేతం చేసేందుకు ఐబీహెచ్ఐ శ్రీకారం చుట్టిందని తెలిపారు. అవగాహన తీసుకురావడానికి ఆదివారం ఏర్పాటు చేసిన 'కేర్ వాక్' కార్యక్రమంలో నగరంలోని బ్రిటిష్ దౌత్య కార్యాలయ డిప్యూటీ హై కమిషనర్ మైక్ నిథావ్రియానకిస్, చలనచిత్ర ఛాయాగ్రాహకుడు రాజీవ్‌మీనన్, మహేష్ మెమోరియల్ ట్రస్టు అరుణాసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. నందంబాక్కంలోని మియాట్ ఆసుపత్రి నుంచి మద్రాస్ వార్ సెమెట్రీ మీదుగా సెయింట్ థామస్ మౌంట్‌కు 'వాక్' సాగింది. వైద్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం అందించనున్నామని డాక్టర్ పృథ్వీ వెల్లడించారు. క్యాన్సర్‌కి సంబంధించి వచ్చేనెల 6, 7 తేదీల్లో జరగనున్న ఐబీహెచ్ఐ సదస్సులో బ్రిటన్‌కు చెందిన 30 మందికిపైగా అంకాలజిస్టులు పాల్గొననున్నారన్నారు. అంతర్జాతీయంగా అందుబాటులోకొచ్చిన చికిత్సలపై చర్చించనున్నట్లు వివరించారు. సకాలంలో క్యాన్సర్‌ను గుర్తించడం వైద్యులు తమ బాధ్యతగా భావించాలని కోరారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ పృథ్వీ.. చిత్రంలో మైక్, రాజీవ్‌మీనన్ తదితరులు